క్లుప్తంగా

రేపు సైన్స్ ఎగ్జిబిషన్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద గల ప్రతిభ హైస్కూల్‌లో సోమవారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ తొనంగి వెంకటరమణి యాదవ్ శనివారం తెలిపారు. 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు వివిధ అంశాలపై ఇక్కడ నమూనాలు ఏర్పాటు చేయనున్నారు. ఆరోజు ఉదయం తొమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నామన్నారు.

మర్రిపాలెంలో క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ జయోన్ చర్చ్, జీసస్ క్రైస్ట్ ట్రాన్స్‌ఫర్మింగ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థన వేడుకల్లో ఆయన పాల్గొని క్రైస్తవులకు ముందుగా పండుగ శుభాకాంక్షలు. అనంతరం చర్చి సభ్యులు శ్రీధర్‌ను సత్కరించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ కొండవాలు ప్రాంతంలో నిర్మించిన పెద్ద కాలువ, సీసీ రోడ్డు, సామాజిక భవనం నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్ భర్త పుర్రె సురేష్‌యాదవ్ శనివారం పరిశీలించారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో ఇక్కడ వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులు ఎంత వరకు వచ్చాయి. పనులలో నాణ్యతను పరిశీలించారు.

వేదలకు వస్త్రాల పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల చర్చిలో శనివారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 58వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గులిగిందల కృష్ణ తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం చర్చిలో పలువురు పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ నేడు

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఆదివారం ఉదయం 6 గంటలకు స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తామని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి సూర్యనారాయణ రాజు చెప్పారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. క్రీడాకారులు నిర్దేశించిన సమయానికి హాజరుకావాలని సూచించారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు



క్యూల్లో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దర్శన క్యూలు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల, దేవస్థానం, ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి. అన్నప్రసాద వితరణ భవనం వద్ద భక్తులు బారులు తీరారు.

18 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.శాంతారం సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మహారాష్ట్రలోని పూణేకు చెందిన సాగర్‌బాపు ముతేకర్ 18 కేజీల గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. గంజయి సీజ్ చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

అంగన్‌వాడీలకు కరెంట్ షాక్..!



లక్ష్మీనగర్ ఈ-బ్లాక్ స్కూల్లోని భవనంలో నిర్వహిస్తున్న రెండు కేంద్రాలు

- భవనాలు కేటగిరీ–2 గా **మార్పు**
- భారీగా పెరగనున్న విద్యు**త్ బిల్లులు**
- శ్లాబ్ మారడంతో ఖాళీ **చేయాలంటున్న** యజమానులు
- ఆందోళనలో అంగన్‌వా**డీ కార్యకర్తలు**
- నగరంలో కేంద్రాల నిర్వహణకు దొరకని వసతి



90వ వార్డు బుచ్చిరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రం

నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలు **60**

సొంత భవనాలు ఉన్న కేంద్రాలు **06**

అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలు **14**

రెంట్ ఫ్రీ భవనాల్లో నిర్వహించే కేంద్రాలు **40**

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ బిల్లులు షాక్ ఇస్తున్నాయి. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల విద్యుత్ బిల్లు కేటగిరీ –1గా ఉండగా, దీన్ని ప్రస్తుతం కేటగిరీ–2కింద మార్పు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించడంతో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

పశ్చిమ నియోజకవర్గంలో 60 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 14 చోట్ల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలినవి రెంట్ ఫ్రీ భవనాలు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆ శాఖ సిబ్బంది, తక్షణమే కేటగిరీ–2గా మార్పు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. లేకుంటే భారీగా జరిమానా విధిస్తామని చెబుతుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. కేటగిరి–2గా మార్పు చేస్తే రానున్న రోజుల్లో అద్దె భవనాలకు విద్యుత్ బిల్లుల మోత మోగనుంది. ప్రభుత్వ పరంగా ఉన్న భవనాలు, రెంట్ ఫ్రీ భవనాలకు కూడా విద్యుత్ శాఖ సిబ్బంది ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారు.

కేంద్రాలు ఖాళీ చేయాలని ఒత్తిడి

అద్దె భవనాలకు ప్రభుత్వం అరకరగానే డబ్బులు చెల్లిస్తుంది. నియోజకవర్గంలో కొన్ని కేంద్రాలకు నెలకు రూ.5 వేలు లోపు మాత్రమే ప్రభుత్వం అద్దె రూపేణా చెల్లిస్తోంది. అయితే ప్రస్తుతం కేటగిరీ–2గా విద్యుత్ కనెక్షన్ మార్చుకున్నట్లయితే భారీగా విద్యుత్ బిల్లులు వస్తే, తమకు ప్రభుత్వ సంక్షేమపథకాలు పోతాయనే భయంతో కొంతమంది యజమానాలు కేంద్రాలను ఖాళీ చేయాలని కార్యకర్తలపై ఒత్తిడి తెస్తున్నారు. కేంద్రాల నిర్వహణను ఏమాత్రం పట్టించుకోక పోగా.. తమకు వేతనాలు పెంచకపోగా, ఇప్పుడివేమి కష్టాలని కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రాల నిర్వహణ భారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల వయసు గల చిన్నారుల కోసం ప్రీ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్రాల్లోనే మధ్యాహ్నం భోజనం వండిపెడుతున్నారు. మెనూ చార్జీల కింద ప్రభుత్వం ఒక్కో చిన్నారికి రోజుకు రూపాయిన్నర ఇస్తోంది. ప్రస్తుతం కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో చిన్నారులకు పౌష్టికాహారం వండిపెట్టడం తలకుమించిన భారమవుతోందని కేంద్రాల కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వచ్చే జీతాల్లోంచే కేంద్రాల నిర్వహణకు ముందస్తు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు.

కేంద్రాలకు దొరకని వసతి

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె డబ్బులతో నియోజకవర్గంలో తగిన వసతులతో కూడిన భవనాలు దొరకని పరిస్థితి. కేంద్రాల కార్యకర్తలు తమకు ఉన్న పరిచయాలతో ఏదో ఒకచోట భవనాలను అద్దెకు తీసుకున్నా, ఇప్పుడు విద్యుత్ సరఫరా కేటగిరీ–2 మార్పు చేస్తామని ఆ శాఖ సిబ్బంది ఇంటికివచ్చి చెబుతుండటంతో, యజమానులు ఆలోచనలో పడుతున్నారు. ఇప్పటి వరకు వచ్చే విద్యుత్ బిల్లులకు రెట్టింపు బిల్లు వచ్చే అవకాశం ఉందని, తెలుసుకుని, మా ఇళ్లలో కేంద్రాలు వద్దని తెగేసి చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నఫళంగా కేంద్రాలను ఎక్కడికి మార్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

సకాలంలో మంజూరు కాని బిల్లులు

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో కేంద్రాల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ బండ ఖర్చులు అధికమవుతున్నాయని చెబుతున్నారు. జీతాలు పెంపు మాట దేవుడెరుగు, అద్దె మొదలు మెనూ చార్జీల వరకు అన్నింటిపైనా ఎంతో కొంత ప్రతి నెలా తామే చేతి డబ్బులు పెట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం పాటుపడే అంగన్‌వాడీ కార్యకర్తల విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుంటాం



దీక్ష శిబిరంలో నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుని తీరుతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 75వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శనివారం దీక్షలో సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ మాట్లాడుతూ హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుని తీరాలని, తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. సుమారు 40 వేల మంది కృషితో ఆస్పత్రి ఏర్పాటైందని, దీనిని ప్రైవేటీకరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. పోర్టు వద్ద ఉన్న నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయం కొనసాగించే పక్షంలో కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల మద్దతుతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, శంకర్రావు, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శ్రీను, రాఘవులు, విజయారావు, నర్సింగరావు పాల్గన్నారు.

బీజేపీ విధానాలను 'కూటమి' సమర్థించడం శోచనీయం



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్మికులను ఆర్థికంగా కుంగదీసే కుతంత్రాలకు యాజమాన్యం స్వస్తి పలకాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తి కోసం పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం ఆర్థికంగా వేధిస్తోందన్నారు. యాజమాన్యం తన వైఖరిని మార్చుకుని కార్మికులకు న్యాయంగా రావాలసిన జీతభత్యాలను తక్షణం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా 18న ఉక్కు అడ్మిన్ వద్ద జరిగే ధర్నాలో ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాల్గోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తన వాగ్దానాలకు మరిచి కేంద్రంలోని బీజేపీ విధానాలను సమర్థించడం అత్యంత శోచనీయమన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు స్టీల్ యాజమాన్యంపై ఒత్తిడి పెంచి పరిశ్రమ, కార్మికులకు అనుకూల నిర్ణయాన్ని తీసుకునే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా స్టీల్‌ప్లాంట్‌లో భవిష్యత్తు తరాలకు ఉపాధి అవకాశాలను కల్పించగలుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, స్టీల్ సీఐటీయూ నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె. గంగాధర్, కృష్ణమూర్తి, టీవీకే రాజు, కేవీ సత్యనారాయణ, పుల్లారావు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ మహోత్సవాలు



అలయ కలశాన్ని తిరువీధిగా తీసుకొస్తున్న పూజారి వంశీయులు, భక్తులు



అమ్మవారి విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న పూజారులు, భక్తులు

సింహాచలం: అడవివరం గ్రామదేవత, వరాహ లక్ష్మీ నృసింహ స్వామి సోదరి బంగారమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణం, పునః విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండో రోజు శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశనలు, వాస్తు హోమం, వాస్తు బలిహరణ, నిత్య బలిహరణ, యంత్రాలకు అగ్ని స్పర్శ, కలశాల శుద్ధి, క్షీరాభిషేకం, జలాధివాసం, గ్రామ బలిహరణ, సాయంత్రం ధాన్యాధివాసం, యాగశాలార్చన, దేవాతాహ్వానం, హోమం, పంచసవ్యాధివాసం తదితర పూజలు నిర్వహించారు. దేవస్థానం వేదపండితులు ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అమ్మవారి ఆలయ పూజారులు లండ వంశస్తులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

ఖోఖోలో బుల్లయ్య జట్టుకు ద్వితీయ స్థానం

సీతంపేట : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల ఖోఖో టోర్నమెంట్‌లో లంకపల్లి బుల్లయ్య కళాశాల మహిళల జట్టు ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో 11 కళాశాలలు పాల్గొనగా బుల్లయ్య విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలిచారు. త్వరలో కాలీకట్‌లో జరగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలకు బుల్లయ్య కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు హేమ, చైతన్య దీపిక, నవ్యశ్రీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపై అక్రమ పార్కింగ్



నేతాజీ గ్రంథాలయం వద్ద షాపింగ్ మాల్స్ బయటే అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలు

కంచరపాలెం: నేతాజీ కూడలి బీఆర్‌టీఎస్ రహదారి నుంచి ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్‌కు వెళ్లే సబ్‌వే మార్గంలో చిరు వ్యాపారాలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వినియోగదారులు వాహనాలను ఇష్టానుసారం పార్క్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్స్‌ల్లో వ్యాపారాలు చేస్తుండడంతో వినియోగదారుల ద్విచక్ర వాహనాలు సబ్‌వే మార్గాల్లో పార్కింగ్ చేయడంతో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. అటుగా వెళ్లే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ట్రాఫిక్ పోలీసులు సమస్యపై స్పందించాలని పలువురు పాదచారులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి జానపద కళా ఉత్సవం నేడు



జానపద ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, తదితరులు

సీతంపేట : భారత సాంస్కృతిక సహకార స్నేహ సంస్థ(ఇస్కఫ్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'రాష్ట్ర స్థాయి జానపద కళా ఉత్సవం' వైభవంగా నిర్వహిస్తామని సంస్థ ప్రధాన కార్యదర్శి డి.మార్కెండేయులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కార్యాచరణపై శనివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే జానపద కళలను భావితరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఇస్కఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మార్కెండేయులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు జానపద కళా ఉత్సవం అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏరాట్లు చేశామన్నారు. ఏపీ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సుమారు వంద మంది కళాకారులు పాల్గొని 30కి పైగా ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఇస్కఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఇస్కఫ్ అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు, ఉత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు టి.ఎస్.సుకుమారన్, ప్రధాన కార్యదర్శి డి.మార్కెండేయులు, కోశాధికారి కె.సత్యాంజనేయ, కల్చరల్ సెక్రటరీ సీహెచ్.మధుబాబు, రాంప్రభు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా యువ చైతన్య దినోత్సవం



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, తదితరులు

సీతంపేట : గురజాడ వర్ధంతి సందర్భంగా సహృదయ సాహితి, గురజాడ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా – భారత్ సంయుక్త నిర్వహణలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో యువ చైతన్య దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు రచించిన ''మీ పేరేమిటి'' గురజాడ కథలు, మహా కవితా ఖండికలు, ప్రకాశిక 4వ సంచికను ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ మహాకవి అని, రచనల ద్వారా సమాజంలో మార్పు ఆశించారన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గురజాడ తెలుగు సాహిత్యానికి దశ, దిశ నిర్దేశించారన్నారు. ముత్యాలసరాలు అనే నూతన చందస్సు రచించి తెలుగుతల్లికి విలువైన హారాన్ని సమర్పించారని కొనియాడారు. గురజాడ ఫౌండేషన్ సంచాలకులు కొవ్వలి గోపాలకృష్ణ మాట్లాడుతూ గురజాడ రచనలు, కవితలు, కథానికలను ఆవిష్కరించడం హర్షదాయకమన్నారు. గురజాడ కవితా సౌరభం అనే అంశంపై రచయితలు డి.వి.సూర్యారావు విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు.

టిడ్కో ఇళ్ల వద్ద లబ్ధిదారుల ఆందోళన

కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన



దయాల్‌నగర్ టిడ్కో గృహాల వద్ద కుటుంబాలతో కలిసి ఆందోళన చేస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు



చీకట్లో అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

పెదగంట్యాడ: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు శనివారం కదం తొక్కారు. కనీస వసతులు కల్పించకుండా ఈ నెల 11న దయాల్‌నగర్‌లో టిడ్కో ఇళ్లు తమకు అప్పగించారని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి ఉందన్నారు. కనీసం ఎలా ఉన్నారని అడిగేనాథుడే కరువైయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తూ పెదగంట్యాడ దయాల్‌నగర్ కేఎల్‌రావు నగర్ సమీపంలో ఉన్న టిడ్కో గృహల వద్ద శనివారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేమంతా కుటుంబాలతో వచ్చి దయాల్‌నగర్ టిడ్కో గృహాల్లో నివాసం ఉంటూ నానా అవస్థలు పడుతున్నామని, ఈ విషయం తెలిసి కూడా అటు అధికారులు..ఇటు నాయకులు మా వద్దకు రాకపోవడం దారుణమన్నారు. తాగునీరు ఇవ్వకున్నా.. రోడ్లు వేయకపోయినా, కాలువలు నిర్మించకపోయినా ఇక్కడే ఉంటున్నామని, ఇకపై ఇక్కడే ఉంటామని.. చావైనా బతుకైనా ఇక్కడేనని తేల్చిచెప్పారు. సొంతింటి కలను నిజం చేస్తారని 2017 నుంచి ఎదురు చూశామని, కట్టిన ఇళ్లు మంజూరు చేయకపోయినా..బ్యాంక్ రుణాలు చెల్లిస్తున్నామన్నారు. ఓ వైపు ఇంటి అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే మరో పక్క బ్యాంక్ రుణాలు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కేటాయించిన ఇళ్లకు సంబంధించి వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరారు. కనీస సదుపాయాలు రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు వెంటనే సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ అందరి నాయకులు, అధికారులు చుటూ తిరిగామని ఎవ్వరూ మమ్మల్ని పట్టించుకోవడం లేదని కన్నీరు మున్నీరయ్యారు. సహనం కోల్పోతున్నామని సదుపాయాలు కల్పించేవరకూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

ఉక్కు నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా వారి అనుయాయులకు కట్టబెట్టాలనే ఉద్దేశ్యంతో ఆది నుంచి కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో 1,402 రోజులుగా రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం..కార్మికులపై కక్ష సాధింపులకు దిగుతోందని, వీటిలో భాగమే జీతాలు చెల్లించకపోవడమన్నారు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం ఉక్కును పరిరక్షిస్తామని నమ్మబలుకుతూ మరోవైపు కార్మికుల గొంతు నొక్కాలని చూస్తోందన్నారు. మూడు మాసాలుగా ఉక్కు కార్మికులకు, ఆరు నెలలుగా కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు చెల్లించలేదని, ఈ విషయంలో కూటమి నేతలు నోరు మెదపకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఈ నెల 18లోగా జీతాలు చెల్లించకపోతే కార్మికులు, కుటుంబాలతో కలిసి పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విళ్లా రామ్మోహన్ కుమార్, వి.శ్రీనివాసరావు, కారు రమణ, పీవీ రమణమూర్తి, కోరాడ వెంకటరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి షణ్ముఖరావు

అక్కిరెడ్డిపాలెం: లోక్ అదాలత్‌లతో కేసులకు సత్వర పరిష్కారం లభించనుందని 8వ అడిషనల్ అండ్ సెషన్స్ జడ్జి కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ గాజువాక జడ్జి జి.షణ్ముఖరావు అన్నారు. శనివారం గాజువాక కోర్టులో ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో 884 కేసుల్లో రూ.6,13,82,340 జరిమానాల రూపంలో వసూలు చేశామన్నారు. కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ సులువైన మార్గమన్నారు. కార్యక్రమంలో 8వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి ఎస్.కవిత, అడ్వకేట్ కం లోక్ అదాలత్ మెంబర్ కె.సీతామహాలక్ష్మి, సోషల్ వర్కర్ వి.వినోద్ కుమార్, గాజువాక 3వ అడిషనల్ చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జడ్జి వి.పల్లవి, లోక్ అదాలత్ మెంబర్, జడ్జి ఈ.గిల్‌బర్ట్, గాజువాక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఈ.రాజేంద్రబాబు, లోక్ అదాలత్ మెంబర్ జి.వి.ఎస్.ప్రసాద్, గాజువాక సివిల్ జడ్జి వై.శ్రీలక్ష్మి, లోక్ అదాలత్ మెంబర్ పి.వి.వి.రవికుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

'40 ఏళ్ల స్నేహం' సావనీర్ ఆవిష్కరణ



సావనీర్‌ను ఆవిష్కరింపజేస్తున్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సందడి చేశారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన 1984 బ్యాచ్ విద్యార్థులు రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీనిలో భాగంగా 40 ఏళ్ల స్నేహం.. సావనీర్‌ను అప్పటి ఉపాధ్యాయుల చేతుల మీదుగా పూర్వ విద్యార్థులు ఆవిష్కరించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు కె.చంద్రశేఖరం, రాదా ప్రసాదరావు, మరియదాస్, జోజిబాబు, డి.కొండలరావు, ప్రసాదరావు పూర్వ విద్యార్థుల సేవలను కొనియాడారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డీవీ చలం, తదితరులు పాల్గొన్నారు.